క్లుప్తంగా

9న ఉగాది పంచాంగ శ్రవణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 9వ తేదీన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో భారతీయ సంస్కృతీ పరిరక్షణ సమితి ఆధ్వర్యాన ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.గోపీచంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు మైసూర్ దత్త పీఠం ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ క్రోవి పార్థసారథి ఉగాది పంచాంగ శ్రవణం చేస్తారన్నారు. భక్తులు పంచాంగ శ్రవణంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

భక్తులను అలరించిన భక్తిరంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై బుధవారం సాయంత్రం ఆలపించిన భక్తిరంజని భక్తులను అలరించింది. బుధవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన ఎస్.సురేఖ పలు అమ్మవారి కీర్తనలను ఆలపించారు. సురేఖకు రేవేష్ వయోలిన్, జగన్మోహిని మృదంగంపై చక్కటి సహకారం అందించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ధర్మపథం వేదిక వద్దకు చేరుకుని భక్తి గీతాలను ఆస్వాదించారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఆలయాల పునఃప్రతిష్ఠ



ఉయ్యూరు: పట్టణంలో వేణుగోపాల స్వామి, శ్రీ పంచపట్టాభిరామస్వామి ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా కొనసాగుతున్నాయి. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాలు జీర్ణదశకు చేరుకోవటంతో దేవదాయశాఖ, పాలక మండలి సంయుక్తంగా దాతల సహకారంతో పునర్నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు పూర్తి కావటంతో ఈనెల 4న ప్రతిష్ఠా కార్యక్రమానికి ముహూర్తం నిర్ణయించారు. ఈ నేపథ్యంలో యాగశాలలో గత నెల 31వ తేదీ నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆగమ పండితుడు డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి పర్యవేక్షణలో బుధవారం విశేష హోమాలు జరిపించారు. ఆలయ చైర్మన్ లోయ చింతయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు సతీ సమేతంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఈఓ శ్రీనివాస రావు పర్యవేక్షించారు.

రహదారి పనుల పరిశీలన



కంకిపాడు: వేల్పూరు శివారు లక్ష్మీపురం ప్రధాన రహదారి నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఈ రహదారిని అభివృద్ధి చేయాలని విన్నవించారు. దీంతో అభివృద్ధి పనులకు అధికారులు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.9 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.8 లక్షలు రోడ్డు అభివృద్ధికి కేటాయించారు. రూ.17 లక్షలతో తారురోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. పనులను పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, స్థానిక వైఎస్సార్ సీపీ నేత చెన్నుబోయిన సుబ్బారావు బుధవారం పరిశీలించారు.

బాబూ.. మా ఉసురు తగులుద్ది

- పశ్చిమంలో పెన్షన్ల పంపిణీ ప్రారంభం
- పెన్షన్ల కోసం సచివాలయాల వద్ద అల్లాడిన వృద్ధులు
- టీడీపీ తీరుపై వృద్ధుల శాపనార్థాలు


కొత్తపేటలోని సచివాలయంలో వేచి ఉన్న లబ్ధిదారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'బాబూ చంద్రబాబు...మా ముసలోళ్ల ఉసురు తగులుద్ది. ఈ వయస్సులో మమ్మల్ని నడి ఎండలో తిప్పుతున్నావు. ప్రతి నెలా ఇంటికి వచ్చి వలంటీర్ పెన్షన్ ఇచ్చేవాడు. ఇప్పుడు నీ దయవల్ల రోడ్డుపాలయ్యాం. తప్పకుండా నువ్వు ఓడిపోతావు. మా జగన్‌బాబు అధికారంలోకి వస్తాడు.' అంటూ సచివాలయాల వద్ద బారులు తీరిన వృద్ధులు చంద్రబాబుకు శాపనార్థాలు పెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. 58 మాసాలుగా మొదటి తేదీ రాగానే తెల్లవారుజామునే ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇచ్చే వలంటీర్లను టీడీపీ కూటమి పుణ్యమా అంటూ వారిని విధుల నుంచి తప్పించారు. దాంతో సచివాలయం వద్దకు వచ్చి పెన్షన్లు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాంతో ఈ నెల మూడు నుంచి ఆరో తేదీ వరకూ పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆ క్రమంలో పెన్షన్ల పంపిణీ ప్రక్రియ బుధవారం సాయంత్రం పశ్చిమ నియోజకవర్గంలో ప్రారంభమైంది.

ఉదయం నుంచి ఎదురుచూపులు

పెన్షన్ల పంపిణీకి సంబంధించి పశ్చిమ నియోజకవర్గంలో కేవలం కొన్ని డివిజన్లలోనే ప్రారంభమైంది. అది కూడా కొన్ని సచివాలయాల పరిధుల్లో మాత్రమే పెన్షన్ల పంపిణీ ప్రారంభమైంది. వృద్ధులు చాలా మంది బుధవారం ఉదయమే సచివాలయాల వద్దకు చేరుకున్నారు. కానీ సచివాలయాల సిబ్బంది బ్యాంకుల నుంచి నగదును తీసుకొచ్చి సాయంత్రం నుంచి పంపిణీ చేస్తామని ప్రకటించటంతో అందరూ అక్కడే ఎదురు చూశారు. అయినా అన్ని సచివాలయాల్లో పంపిణీ ప్రారంభం కాలేదు. కేవలం కొద్ది డివిజన్లలోని కొన్ని సచివాయాల్లో మాత్రమే నామమాత్రంగా పెన్షన్ల పంపిణీ బుధవారం సాయంత్రం నాలుగు గంటల తరువాత ప్రారంభించారు.

సచివాలయాలకు క్యూ..

చాలా సచివాయాల పరిధుల్లో పెన్షన్ల కోసం బుధవారం ఉదయమే వృద్ధులు, దివ్యాంగులు చేరుకొని ఎదురు చూడటం కనిపించింది. ప్రధానంగా నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, ఆపరేషన్లు చేయించుకున్న పలువురు మహిళలు పెన్షన్ల కోసం నడుచుకుంటూ సచివాలయాల వద్దకు చేరుకోవటానికి నానా తంటాలు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే ఉండి అల్లాడిపోయారు. అందులోనూ ఎండ వేడికి ఉడికిపోయారు. వృద్ధులు, దివ్యాంగులు వెళ్లిపోతే పెన్షన్ వస్తుందో రాదో అనే భయంతో అక్కడే ఉండి ఎదురు చూశారు. తీరా కొన్ని సచివాలయాల పరిధుల్లో గురువారం నుంచి పెన్షన్ ఇస్తామని ప్రకటించటంతో ఉసురుమంటూ వెనుతిరిగారు.

కూటమికి శాపనార్థాలు

వృద్ధులు చంద్రబాబు కూటమికి శాపనార్థాలు పెట్టారు. ఐదేళ్లుగా ఇంట్లో ఉండి చక్కగా వలంటీర్ల ద్వారా పెన్షన్ తీసుకునే వాళ్లమని, ఇప్పుడు బాబు అండ్ కంపెనీ వలంటీర్లపై లేనిపోని ఆరోపణలు చేస్తూ వారి ద్వారా మాకు వచ్చే సేవలను అడ్డుకోవటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. బాబు, కల్యాణ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కంటి ఆపరేషన్ చేయించుకున్నా



నేను కంటి ఆపరేషన్ చేయించుకున్నాను. కళ్లు సరిగా కనిపించటం లేదు. ఇంటి నుంచి బయటకు రావద్దని చెబుతున్నా... పెన్షన్ డబ్బులు పోతాయనే భయంతో వచ్చాను. ఉదయం నుంచి చూస్తున్నాను. మధ్యాహ్నం తరువాత అన్నారు, సాయంత్రం అన్నారు. వలంటీర్లు ఉంటే ఈ బాధలు తప్పేవి. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– అరసవల్లి సామ్రాజ్యం, కొత్తపేట

ఇలా తిప్పటం సరికాదు..



ముసలోళ్లను ఇలా తిప్పటం సరికాదు. జగన్‌బాబు వచ్చాక చక్కగా మొదటి తారీఖున ఇంటికి వచ్చి మా వలంటీర్లు పెన్షన్ ఇచ్చేవాళ్లు. ఇప్పుడేమో సచివాలయాలకు వచ్చి పెన్షన్ తీసుకోవాలన్నారు. నడవలేని స్థితిలో ఉన్న మాలాంటి వాళ్లు ఎలా తిరుగుతారు. మాలాంటి వాళ్లను ఇబ్బంది పెట్టడానికి కనీసం మానవత్వం ఉండాలి.

– చింతగుంట నాగేంద్రమ్మ, పూర్ణానందపేట


పింఛన్ కోసం సచివాలయానికి వస్తున్న వృద్ధురాలు


పింఛన్‌దారుడి కష్టాలు

పేదల పెన్షన్‌లను అడ్డుకున్న ద్రోహి చంద్రబాబు

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్


వించిపేటలో దివ్యాంగుడికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి

వించిపేట(విజయవాడపశ్చిమ): జగనన్న ప్రభుత్వంలో ప్రతి నెల ఠంచన్‌గా 1వ తేదీనే పెన్షన్ అందుకుంటున్న అవ్వాతాతలు, దివ్యాంగులు చంద్రబాబు నాయుడు కుటిల రాజకీయాలతో సచివాలయాల చుట్టు తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావుతో కలిసి ఆసిఫ్ బుధవారం వించిపేట నైజాం గేటు సెంటర్ నుంచి పలు వీధుల్లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తాము అనేక రకాల సంక్షేమ పథకాలను అందుకుంటూ తామంతా సంతోషంగా ఉన్నామని.. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబున్నారన్నారు. ప్రజలను ఇబ్బందులు పెట్టేందుకు చంద్రబాబు, పవన్ కుట్రపన్నారని ఆరోపించారు. ప్రతి నెల 1వ తేదీ తెల్లవారుజామునే అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పెన్షన్‌లు అందించే వలంటీర్ల వ్యవస్థపై అక్రోషం వెల్లగక్కుతున్నారని విమర్శించారు. ఈ క్రమంలోనే వారిపై కేసులు పెట్టడం, విధుల నుంచి తొలగించడం, ఎన్నికల సంఘానికి లేఖలు రాయటం వంటి కుట్రపూరిత చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రజలను ఇబ్బందులు పెట్టే ఏ ఒక్క నాయకున్ని ప్రజలు క్షమించరని, రానున్న ఎన్నికల్లో వారే తగిన బుద్ధి చెబుతారని చెప్పారు.

పగటి వేషగాళ్లను నమ్మకండి..

పశ్చిమ నియోజవర్గం స్వరూపమే తెలియని చంద్రబాబు కోవర్టు సుజనా చౌదరి బీజేపీ అభ్యర్థిగా ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నాడని.. ఆయన ఎన్నికల తరువాత నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటాడో లేదో అర్థం చేసుకోవాలని ఆసిఫ్ కోరారు. ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలే నా సమస్యగా తీసుకుని వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ఉన్నానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఏనుగుల సునీల్‌కుమార్, పల్లె బాబు, బూదాల శ్రీనివాసరావు, రమేష్ రాజు, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఎస్‌ఆర్‌ఆర్ విద్యార్థులు


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పీబీ సిద్ధార్థ కళాశాలలో తెలుగు భాషపై పట్టు.. చూపెట్టు పోటీల్లో తమ విద్యార్థులు సత్తాచాటడం ఆనందంగా ఉందని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు భాషపై పట్టు.. చూపెట్టు పోటీల్లో విజేతల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థిని కీర్తన లేఖ రచన విభాగంలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు. అలాగే కళాశాల నుంచి పోటీల్లో పాల్గొని విజయం సాధించిన వారితో పాటు ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు విజేతలను స్ఫూర్తిగా తీసుకుని పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.వి.శాంతకుమారి, ఏ.భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ బోర్డుల చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ డిస్‌ప్లే బోర్డులు చోరీకి గురయ్యాయి. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అవగాహన చేసుకునేందుకు వీలుగా రెండు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ) డిస్‌ప్లే బోర్డులను ప్రభుత్వం పంపిణీ చేసింది. పాఠశాలలోని తరగతి గదుల్లో బిగించిన ఈ ఐఎఫ్‌పీ డిస్‌ప్లే బోర్డులను దుండగులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో అపహరించారు. గది తాళాలు బద్దలుకొట్టి బోర్డులను ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు విషయాన్ని గుర్తించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్. పద్మజ ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ ఘటనాస్థలిని పరిశీలించారు. ఐఎఫ్‌పీ బోర్డుల చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆసిఫ్, కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పాత బస్తీలో మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు రాయల్ హోటల్ సెంటర్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ముస్లింలు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. అనంతరం ఆసిఫ్ తోటి ముస్లింలు, మిత్రులతో కలిసి ఇఫ్తార్‌ను స్వీకరించారు.

కార్పొరేట్ మోసగాళ్లకు బుద్ధి చెప్పాలి..

ఈ సందర్భంగా ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ పాతబస్తీలో విభిన్న కులాలు, మతాలు కలిసి సహజీవనం చేస్తున్నాయన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజానీకం ఇక్కడ చక్కని శాంతియుత జీవనాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. ఏ పండుగైనా ప్రతి ఒక్కరూ చక్కగా తమతమ సంప్రదాయాలతో జరుపుకుంటామని, ఒకరికొకరు చక్కని గౌరవాలను ఇచ్చిపుచ్చుకుంటున్నామన్నారు. అయితే నేడు మతోన్మాద శక్తులు, కార్పొరేట్ మోసగాళ్లు ఇక్కడి నుంచి చట్టసభలకు వెళ్లాలని కుట్రలు చేస్తున్నాయన్నారు. అటువంటి వారికి ప్రతి ఒక్కరూ బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రంజాన్ మాసం ప్రతి ఒక్కరికీ మేలు చేయాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఇస్లాంపేటలో రాయల్ హోటల్ సెంటర్‌లో చక్కని కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. అందరూ చక్కని శాంతియుత జీవనాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, ఇర్ఫాన్, యలకల చలపతిరావు, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, నాయకులు అత్తులూరి పెదబాబు, షేక్ హయాత్, సోల్జర్, హనీబాయ్, ఇమామ్, రెహమాన్, మతీన్, చంద్, సలీమ్, చోటు, హబీబ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం


ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ ఆదిలక్ష్మి, ఆసిఫ్ కుటుంబ సభ్యులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని, ఆయనను రెండో సారి సీఎంని చేసేందుకు ప్రజలందరూ ఆసక్తితో ఎదురు చూస్తున్నారని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్. ఆసిఫ్ విజయాన్ని కాంక్షిస్తూ 48వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ ఆదిలక్ష్మితో పాటు ఆసిఫ్ కుమారుడు, కుమార్తె జావిద్, రేష్మలతో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రానున్నది జగనన్న ప్రభుత్వమే..

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను తీసుకువచ్చారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి ముందుకే పెన్షన్లు అందించారని, టీడీపీ వల్ల ఈ రోజు పెన్షన్ డబ్బుల కోసం సచివాలయాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రానున్నది జగనన్న ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి ఫ్లైట్‌లో వచ్చిన వాళ్లను తిరస్కరించాలన్నారు. అందరికీ సుపరిచితుడైన ఆసిఫ్‌కే అందరూ అండగా నిలవాలని కోరారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్ నుంచి ప్రారంభమైన పర్యటన ఈద్గామహల్ రోడ్డు, కటికల మస్తాన్ వీధి, టేనర్‌పేట, టీఎంహెచ్ స్కూల్ రోడ్డు మీదుగా సాగింది. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్.మెహరాజ్, అయితా కిశోర్, కోళ్ల రజనీ, మహమ్మద్ బాషా, వి.శ్రీను, రాంపిళ్ల లక్ష్మి, టి.లక్ష్మీ, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు


నవభారతిని సత్కరిస్తున్న విద్యార్థులు

గన్నవరం: ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు, టీచర్స్ సంఘానికి దాసరి నవభారతి అందించిన సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక చింతలపేట ఎంపీపీ పాఠశాలలో బుధవారం ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలు దాసరి నవభారతి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆమెను యూటీఎఫ్ సంఘ నేతలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ రంగంలో 40 ఏళ్ల పాటు నవభారతి సుదీర్ఘమైన సేవలందించారని చెప్పారు. జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనేది ఆమెను చూసి నేర్చుకోవచ్చాని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎంఈఓ-1, 2లు కె.రవికుమార్, కమల, విశ్రాంత ఎంఈఓ జయబాబు, విశ్రాంత అధ్యాపకుడు గన్నె వెంకట్రావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లెనిన్‌బాబు, జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెనమలూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వణుకూరు ఆంజనేయస్వామివారి గుడి ప్రాంతానికి చెందిన బడుగు శ్రీనివాసరావు అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10 మద్యం సీసాలు, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని తెలిపారు.

టీడీపీ నేత నిర్వాకంపై ఆందోళన


బాపులపాడు సీఎస్ఐ చర్చి వద్ద ఆందోళన చేస్తున్న సంఘ సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక బాపులపాడు పరిశుద్ధ సీయోను సీఎస్ఐ దేవాలయం సంఘస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. చర్చి పునర్నిర్మాణం కోసం దాతల నుంచి సేకరించిన విరాళాలను సంఘ సభ్యుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు పెద్ద ఎత్తున గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. విరాళాలు అందించిన దాతల వివరాలు, చర్చి నిర్మాణ ఖర్చుల వివరాలు తెలియజేయకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సీఎస్ఐ చర్చి బిషప్‌కు సంఘస్తులు ఫిర్యాదు చేశారనే అక్కసుతో ఇప్పుడు ఏకంగా చర్చి నిర్మాణ పనులను అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారని సంఘస్తులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ అనుమతి లేకుండా చర్చి నిర్మాణం జరుగుతుందంటూ దయాల రాజేశ్వరరావు తన సొంత బావమరిది డొప్పల జయప్రకాష్‌ను అడ్డుపెట్టుకుని న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకువచ్చారని దుయ్యబట్టారు. దీంతో ప్రస్తుతం నూతన చర్చిను అధికారులు సీజ్ చేశారని సంఘస్తులు వాపోయారు. చర్చి నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని గతంలో చెప్పినా దయాల రాజేశ్వరరావు ఇప్పుడు దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సుదీర్ఘ చరిత్ర కలిగిన బాపులపాడు పరిశుద్ధ సీయోను సీఎస్ఐ దేవాలయం సంఘస్తులకు ఇప్పుడూ ప్రార్థనా మందిరం లేకపోవటంతో నడిరోడ్డుపై నిలబడ్డామని వాపోయారు. చర్చి పునర్నిర్మాణ కమిటీకి సారధ్యం వహించిన దయాల రాజేశ్వరరావు నిర్వాకం వల్లే నేడు ఈ దుస్థితి వచ్చిందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ గోడును అర్థం చేసుకుని ప్రార్థనా మందిరంలోకి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.